# మాజీ మంత్రిపై కేసు నమోదు

- కార్యకర్తపై అక్రమ కేసును ప్రశ్నించినందుకే..
- ఇద్దరు మాజీ కార్పొరేషన్ చైర్మన్లతోపాటు 18 మందిపైనా కేసులు
- మాజీ మంత్రిపై కేసు ప్రభుత్వ కుట్ర : మధుసూదనాచారి
- ఎన్ని కేసులు పెట్టినా భయపడం: శ్రీనివాస్‌గౌడ్


మహబూబ్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ కార్యకర్తపై పెట్టిన అక్రమ కేసును ప్రశ్నించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు 18మంది నేతలపై కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన బీఆర్‌ఎస్ కార్యకర్తను మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీసులు తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన విషయం తెల్సిందే. మరుసటి రోజు స్టేషన్ ఎదుట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలు నిరసన చేపట్టారు. దీనికి స్పందించిన వన్‌టౌన్ సీఐ అప్పయ్య.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావని హామీ ఇవ్వడంతో మాజీ మంత్రి ఆందోళన విరమించిన విషయం విదితమే. ఆ తర్వాత కొందరు కాంగ్రెస్ నేతల ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేసినట్టు సమాచారం. శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, బీసీ కమిషన్ మాజీ మెంబర్ రాజుసాగర్, వరద భాస్కర్, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సత్యం యాదవ్, చిట్యాల సుధాకర్, శివరాజ్, పెట్రోల్ బంక్ రమేశ్, గణేశ్, రాము, నర్సింహులు, శరత్‌రెడ్డి, పాల సతీశ్, ఇమ్రాన్, జములయ్యపై అక్టోబర్ 30న సెక్షన్లు 132, 189 (2), 190, 192, 195 (1) 196, 292, 352 ప్రకారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని దీపావళి రోజు అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మీడియాకు లీక్ చేశారు. విషయం తెలుసుకున్న శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి శుక్రవారం మహబూబ్‌నగర్‌కు చేరుకొని సంఘీభావం తెలిపారు. అనంతరం జైల్లో ఉన్న బీఆర్‌ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసి ధైర్యం చెప్పారు.

**అరెస్టుకు రంగం సిద్ధం?**

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై అక్రమంగా కేసులు నమోదు చేసిన ఘటనపై ఇటు కాంగ్రెస్ నేతలు 'నీ తమ్ముడికి పట్టిన గతే నీకు పడుతుంది' అని హెచ్చరికలు జారీ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద ఏదోరకంగా శ్రీనివాస్‌గౌడ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం.

**కేసులకు భయపడేది లేదు : శ్రీనివాస్‌గౌడ్**

అక్రమంగా దివ్యాంగుల ఇండ్లు కూలగొట్టిన విషయాన్ని ప్రశ్నించినందుకు ప్రభుత్వం కక్ష కట్టింది. అందులో భాగంగానే నా కుటుంబంపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నది. ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలి.

**ఈ కేసు రాజకీయ ప్రేరేపిత కుట్ర: మధుసూదనాచారి**

ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన శ్రీనివాస్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే వారి కుటుంబంపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి విమర్శించారు. మాజీ మంత్రి సోదరుడు శ్రీకాంత్‌గౌడ్‌పై పెట్టిన అక్రమ కేసును ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కొత్త సమస్యలను సృష్టిస్తున్నదని ఆరోపించారు. పాలనా వైఫల్యాలను సోషల్ మీడియాలో ప్రశ్నించిన బీఆర్‌ఎస్ కార్యకర్త భాస్కర్ ముదిరాజ్‌ను బెల్ట్‌తో విచక్షణా రహితంగా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## తెలంగాణ విలువ పెంచింది కేసీఆరే

మొదటిపేజీ తరువాయి...

నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. ఉదాహరణకు కరీంనగర్‌లో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఉండే ఎకరం ధర కేసీఆర్ హయాంలో రూ.70 లక్షలకు పెరిగిందని చెప్పారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల కూడా భూముల విలువ బాగా పెరిగిందని వివరించారు. హైడ్రా కూల్చివేతల విషయంపై స్పందిస్తూ.. 'ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వమే అన్ని పర్మిషన్లు ఇచ్చిన నివాసాలను కూల్చివేయడం చూస్తుంటే మనస్తాపానికి గురిచేస్తున్నది. అది ఎంతమాత్రం న్యాయం కాదు' అని పేర్కొన్నారు. మూసీ ప్రాజెక్టు పునర్జీవంపై మాట్లాడుతూ.. తెలంగాణ బడ్జెట్ రూ.మూడు లక్షల కోట్లు ఉంటే, మూసీకి రూ.1.54 లక్షల కోట్లు ఖర్చు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.


గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## కేసీఆర్ చరిత్రను చెరిపేయలేరు

- రాష్ట్రంలో ఎక్కడ చూసినా కేసీఆర్ ఆనవాళ్లే
- బీఆర్‌ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 1: తెలంగాణలో కేసీఆర్ చరిత్రను చెరిపివేయడం ఎవరి తరం కాదని బీఆర్‌ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేయడం సీఎం రేవంత్‌రెడ్డికి సాధ్యపడదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే కనిపిస్తాయని తెలిపారు. తరాలు మారిన కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలు సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అన్నారు. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచి నీళ్లు, మిషన్ కాకతీయతో చెరువుల మరమ్మతుతో నిండుకుండలా చెరువులు, కుంటలు కనిపిస్తాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.85 వేల కోట్ల రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంట్, జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ సముదాయాలు, మోడల్ ఐవోసీ మార్కెట్లు, హరితహారంలో 285 కోట్ల మొక్కలు నాటడం, సంక్షేమంలోనే దేశంలో తెలంగాణను నంబర్ వన్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేసిన కేసీఆర్ గుర్తులను చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదని అన్నారు.

## కేటీఆర్ పాదయాత్రతో సంజయ్‌కు ఉలుకెందుకు?: సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): 'ప్రజా సమస్యలపై కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటే బండి సంజయ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీలో ప్రధాని మోదీతో కాంగ్రెస్ యుద్ధం చేస్తుంటే, రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారంటూ శుక్రవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. సంజయ్ బాధ చూస్తుంటే ఆర్‌ఎస్ బ్రదర్స్ (రేవంత్, సంజయ్) అవినాభావ సంబంధం ఇట్టే తెలిసిపోతున్నదని చురకలంటించారు. కేటీఆర్‌తో కలిసి రేవంత్, సంజయ్ పాదయాత్ర చేస్తే ప్రజల స్పందన ఏంటో తెలుస్తుందని హితవుపలికారు. అయినా వారిద్దరూ కలిసి మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు పొడిగించాలి: రవీందర్‌సింగ్



హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల నమోదుకు ఈ నెల 6తో ముగియనున్న గడువును మరో 2 నెలలు పొడిగించాలని కోరుతూ పౌరసరఫరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారికి వినతిపత్రాన్ని అందచేశారు. ఓటర్ల నమోదులో ఎదురవుతున్న సమస్యలను సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పట్టభద్రులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఓటర్ల నమోదు కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఓటరు నమోదుకు సంబంధించిన అంశాలపై అందరికీ అవగాహన కల్పించాలని కోరారు.

# నిజామాబాద్‌లో 23 తులాల బంగారం చోరీ


- 8 తులాల వెండి అపహరణ
- ఇంటికి తాళం వేసి ఉండగా ఘటన


నిజామాబాద్‌లో చోరీ జరిగిన ఓ ఇంట్లోని బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

వినాయక్‌నగర్, నవంబర్ 1: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బంగారు ఆభరణాలు, వెండి ఎత్తుకెళ్లారు. స్థానిక న్యూ ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉండే సముద్రాల ఎల్లేశ్వరరావు దీపావళి పండుగను పురస్కరించుకొని గత నెల 28న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మం వెళ్లారు. శుక్రవారం సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం, బీరువాలోని వస్తువులన్నీ చిందవందరగా పడిఉండటంతో చోరీ జరిగినట్టు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ రాజావెంకటరెడ్డి, నగర సీఐ, త్రీటౌన్ ఎస్సై పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. బీరువాలో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలతోపాటు సుమారు 8 తులాల వెండి చోరీకి గురైనట్టు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహేశ్ తెలిపారు.

**బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్పీ ఇంట్లో చోరీ**

కాగజ్‌నగర్, నవంబర్ 1 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ పంచాయతీ పరిధిలోని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్టు రూరల్ ఎస్సై మహేందర్ తెలిపారు. ఎవరులేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువా పగులగొట్టి విలువైన పత్రాలు దొంగిలించారు. సిర్పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి నక్క మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు. కాగా ఆగస్టు చివరి వారంలో హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలోనూ చోరీ జరిగిన విషయం తెలిసిందే.



మీడియాతో మాట్లాడుతున్న ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

## వ్యతిరేక పోస్టులు పెడితే తొక్కి చంపుతాం

- కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంపై, ఎమ్మెల్యేపై తప్పుడు రాతలు రాస్తే ఖబడ్దార్
- ముడా చైర్మన్ లక్ష్మణ్ హెచ్చరిక

మహబూబ్‌నగర్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మా కాంగ్రెస్ పార్టీ పేరు మీద గాని.. మా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేరు మీద.. ప్రభుత్వానికి గానీ వ్యతిరేకంగా పోస్టులు పెడితే మా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి తొక్కి చంపుతాం' అని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇకపై ఎవరైనా తమకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

## హోంగార్డుల చలో హైదరాబాద్

- నేడు ఇందిరాపార్కు వద్ద నిరసన

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): తమ సమస్యల పరిష్కారం కోసం హోంగార్డులు ఆందోళనలకు సిద్ధమయ్యారు. డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నేడు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సన్నద్ధమయ్యారు. ప్రతిపక్షంలో ఉండగా తమకు అనేక హామీలిచ్చి ఊరించిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక వినతి పత్రాలు కూడా తీసుకునేందుకు ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ఇతర ఉద్యోగ సంఘాలతో పాటు హోంగార్డులను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలిచి చర్చించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆందోళనలపై ఆంక్షలు ఉన్నా వెనక్కి తగ్గేది లేదని, శాంతియుతంగానే నిరసన తెలుపుతామని స్పష్టంచేశారు.


ఒంటిపై కిరోసిన్ పోసుకున్న శ్రీధర్‌ను కాపాడుతున్న పోలీసులు

## రాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకొని రక్షించిన పోలీసులు

మట్టెవాడ, నవంబర్ 1: వరంగల్‌లోని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఆటోనగర్‌లో శ్రీధర్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. బుధవారం రాత్రి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు వచ్చిన ఎస్సై విఠల్ తన సిబ్బందితో కలిసి ఫొటోలు తీస్తూ శ్రీధర్‌ను హెచ్చరించాడు. మనస్తాపానికి గురైన శ్రీధర్ అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెంట తెచ్చుకున్న కిరోసిన్ ఒంటి మీద పోసుకున్నాడు. ఎస్సై విఠల్ వేధింపులతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన చావుకు ఆయనే కారణమంటూ శ్రీధర్ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేశాడు. ఎస్సై, సిబ్బంది అతని ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. మట్టెవాడ సీఐ గోపి మాట్లాడుతూ శ్రీధర్ షాపు వద్ద అడ్డంగా ఉన్న వాహనాల ఫొటోలను ఎస్సై విఠల్ తీస్తుండగా ఆందోళన చెంది, ఆవేశంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడని తెలిపారు.

# పోలీస్ రాజ్యం!

మొదటిపేజీ తరువాయి...

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులను నమ్ముకుంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంతోషాలను మింగేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రశ్నించే హక్కును కాలరాసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలులో ఉండగా.. జిల్లాల్లోనూ పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో ఈ నెల మొత్తం పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు ఎస్పీ రూపేశ్ శుక్రవారం ఉత్తర్వులను జారీచేశారు. కామారెడ్డి జిల్లాలో ఈ నెల 7 వరకు పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా 13 జిల్లాల్లో పోలీస్ యాక్ట్‌ను అమలు చేసిందని చెప్తున్నారు. అనధికారికంగా 20కి పైగా జిల్లాల్లో పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. మిగతా జిల్లాల్లోనూ త్వరలో పోలీస్ రాజ్యం మొదలయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరికలు చేస్తున్నారు. అప్పుడు చట్టాన్ని బూచిగా చూపి ప్రశ్నించే ప్రతి గొంతుకను అడ్డుకుంటుందని చెప్తున్నారు.

**11 నెలల్లోనే పెల్లుబికిన ప్రజా వ్యతిరేకత**

కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నది. దీంతో రాష్ట్రంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు నిత్యకృత్యం అయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ విధానాలతో అడ్డామీది కూలీలు మొదలు ఇతర అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రాజెక్టు, ఉచిత బస్సు ప్రయాణం, బతుకమ్మ చీరల ఆర్డర్ నిలిపివేత. ఇలా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేసింది. రుణమాఫీ చేయాలని, రైతుబంధు ఇవ్వాలని అన్నదాతలు, ఉపాధి కోల్పోయామంటూ ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు, చదువుకునే సమయం ఇవ్వాలని నిరుద్యోగులు, రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలని విద్యార్థులు.. ఇలా నష్టపోయిన ప్రతి వర్గం ప్రజలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. ప్రజాభవన్ వేదికగా వివిధ సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. చివరికి పోలీసులు సైతం రాష్ట్రంలో ధర్నాలు చేసే పరిస్థితి దాపురించింది.

**ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక**

రాష్ట్రంలో నిరసనలు తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదిక అందించినట్టు తెలుస్తున్నది. ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇలాగే కొనసాగితే ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తారని, కాంగ్రెస్ నేతల ఇండ్ల వద్ద బైఠాయిస్తారని నివేదికల్లో స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో ఎక్కడికక్కడ నిర్బంధం అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు సమాచారం. ఈ దిశగానే జిల్లాల్లో క్రమంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**ఇనుప కంచెల మాటున సీఎం**

మొదటి నుంచీ ప్రభుత్వం చెప్తున్నదానికి, చేస్తున్నదానికి పొంతన ఉండటం లేదు. సచివాలయం గేట్లు ఓపెన్‌గా ఉంటాయని, ఎప్పుడైనా వచ్చి, ఏ మంత్రినైనా కలువొచ్చని మొదట్లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సచివాలయం వద్ద సాయంత్రం 3-5 గంటల మధ్య మాత్రమే పాస్‌లు ఇస్తున్నారు. లోపల ఆరో అంతస్థు, రెండో అంతస్థులో ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఆ తర్వాత వరుస నిరసనలతో షాక్ తిన్న సీఎం.. 'నిరసనలు వద్దు. నేరుగా వచ్చి నన్ను కలవండి. మీ రేవంత్ అన్నగా పరిష్కరిస్తా' అని మరోసారి నమ్మబలికారు. కానీ, ఎక్కడా నేరుగా ఆయనను కలిసే అవకాశం లేకుండాపోయింది. ఇంటి వద్దకు వెళ్తే పీఏలు, పీఎస్‌లు బాధితుల నుంచి దరఖాస్తులు తీసుకొని పంపించి వేస్తున్నారు. సచివాలయానికి వెళ్తే ఆరో అంతస్థులోకి ప్రవేశం నిషిద్ధం.

**డిప్యూటీ సీఎం చుట్టూ బారికేడ్లు**

డిప్యూటీ సీఎం భట్టి వద్దకు వెళ్లేందుకు బారికేడ్లను అడ్డుపెట్టారు. ఇంటివద్ద, ఇటు సచివాలయంలో బారికేడ్లు ఏర్పాటు చేసుకున్నారు. నిరసనలు హోరెత్తుతుండటంతో సచివాయలం, సీఎం నివాసం చుట్టూ 2 కిలోమీటర్ల మేర 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. సీఎం ఇల్లు, కార్యాలయం, సచివాలయ భద్రతా సిబ్బందిని మార్చేశారు. టీజీఎస్పీ సిబ్బందిని తొలిగించి టీజీఎస్పీఎఫ్‌కు బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ ఎప్పుడో ఇనుప కంచెల చాటుకు వెళ్లిపోయిందని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజాపాలన 11 నెలలకే ఎక్స్‌పైరీ అయ్యిందని ఎద్దేవా చేస్తున్నారు.


సచివాలయం వద్ద పోలీసుల బందోబస్తు

## 'ఎస్పీఎఫ్' రక్షణలోకి సచివాలయం

- భద్రతా విధుల్లోకి 214 మంది సిబ్బంది

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): సచివాలయం బందోబస్తు బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) శుక్రవారం స్వీకరించింది. మొత్తం 214 మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి రక్షణ బాధ్యతలు అప్పగించారు. సచివాలయ భద్రత పర్యవేక్షణ అధికారిగా దేవిదాస్ నియమితులయ్యారు. గతంలో సచివాలయానికి ఎస్పీఎఫ్ బలగాలే బందోబస్తు నిర్వహించేవి. కొత్త సచివాలయం నిర్మించిన తర్వాత ఆ బాధ్యతను స్పెషల్ పోలీసులకు (టీజీఎస్పీ) అప్పగించారు. ఇటీవల ఏక్ పోలీస్ విధానం అమలు కోసం టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు ధర్నాలు చేస్తుండడంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ముఖ్యమంత్రి నివాసం, కార్యాలయం, సచివాలయం వద్ద విధుల్లో ఉన్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ధర్నా చేస్తే పరువు పోవడంతోపాటు భద్రతకు ముప్పు కలుగుతుందని ప్రభుత్వం భావించింది. వెంటనే టీజీఎస్పీని పక్కకు తప్పించింది. మొదట సీఎం నివాసం, కార్యాలయం, తాజాగా సచివాలయాన్ని ఎస్పీఎఫ్ పరిధిలోకి తీసుకెళ్లింది

## ప్రశ్నిస్తే కేసులే

కాంగ్రెస్ పాలనను ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదవుతున్నాయి. ఆగస్టులో రూ.2 లక్షల రుణమాఫీ కాలేదంటూ రైతులు రోడ్లమీదికి రాగా పోలీస్ యాక్ట్‌ను ఎంచుకున్నది. ఆదిలాబాద్‌లో నిరసన తెలిపిన తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన 11 మంది రైతులు, బజార్‌హత్నూర్‌కు చెందిన నలుగురు రైతులపై కేసులు నమోదు చేశారు. నిజామాబాద్‌లో 11 నెలల్లో మూడుసార్లు ఈ చట్టాన్ని ప్రయోగించారు. యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో యాక్ట్ అమల్లో ఉన్నది. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని భావిస్తే ఈ యాక్ట్ అమలు చేస్తారు. కానీ ప్రజలు నిరసన తెలుపుతారనుకున్న ప్రతిసారీ ఈ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నదని ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## 5న ఆటో డ్రైవర్ల మహాధర్నా

- సర్కారు ఆంక్షలెన్ని పెట్టినా జరిపి తీరుతాం
- కుట్రలను ఛేదించి డ్రైవర్లు తరలిరావాలి
- తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టిన ఈ నెల 5న ఇందిరాపార్క్ వద్ద జరిగే చలో హైదరాబాద్-మహా ధర్నాను జరిపి తీరుతామని తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ధర్నాకు ఆటంకం కలిగించడానికి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా వెనుకడుగు వేయకుండా డ్రైవర్లంతా తరలిరావాలని పిలుపునిచ్చింది. హైదరాబాద్ నగరంలో ఆంక్షల పేరుతో రేవంత్ సర్కార్.. సమస్యలు చెప్పుకోవడాన్ని కూడా అణచివేస్తుందని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వేముల మారయ్య విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆటో డ్రైవర్ల ఉపాధిని నాశనం చేసిందని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆరోపించారు. అన్ని వాహన సంఘాలతో కలిపి మహాధర్నా విజయవంతం చేస్తామని తెలిపారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు.. ఆంక్షల పేరుతో వేధించడం సరి కాదని పేర్కొన్నారు.


## 7 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత


బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ప్యాకెట్లు

శంషాబాద్ రూరల్, నవంబర్ 1: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం డ్రగ్స్ పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి ఇక్కడికి డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు నిందితులను డీఆర్‌ఐ అధికారులు అరెస్టు చేశారు. బ్యాంకాక్ నుంచి విమానంలో వచ్చిన ఇద్దరు నిందితులను తెల్లవారుజామున డీఆర్‌ఐ అధికారులు తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో కెల్లాస్ ఫ్యాకెట్లు లభించాయి. వాటిని పరీక్షించగా డ్రగ్స్‌తో కలిసి ఉన్నట్టు గుర్తించారు. ఆ ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని డీఆర్‌ఐ కార్యాలయానికి తరలించారు. వారి వద్ద లభించిన 13 ప్యాకెట్లు 7.096 కిలోల బరువు ఉన్నట్టు తెలిపారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.7 కోట్ల వరకు ఉం టుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## 'మణప్పురం' మేనేజర్ అరెస్టు

- బెట్టింగ్‌లో డబ్బు లు పోగొట్టుకుని మోసాలు షురూ..
- ఫేక్ ఐడీలతో 1.24కోట్ల లోన్లు


మేనేజర్ విశాల్

వికారాబాద్, నవంబర్ 1: మణప్పురంలో బంగారం ఎత్తికెళ్లిన మేనేజర్‌ను పట్టుకున్నట్టు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. వికారాబాద్ మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో మేనేజర్‌గా పనిచేసే విశాల్ 20మంది కస్టమర్లపైన 63 నకిలీ ఇన్వెంటరీ ఐడీలు సృష్టించి రూ.1.24కోట్లు బ్రాంచ్ నుంచి కాజేశాడు. ఉన్నతాధికారులు ఆడిట్‌కు వచ్చే సమయంలో సరిపడా బంగారాన్ని పెట్టేవాడు. అలా నకిలీ ఐడీలతో డబ్బులు తీసుకొని కోట్లు సంపాదించాలనే ఆశతో బెట్టింగ్‌లో పెట్టడంతోపాటు సొంతానికి వాడుకున్నాడు. కస్టమర్లు కుదువ పెట్టిన బంగారం ప్యాకెట్ల నుంచి ఐదింటిని దొంగతనం చేసి పారిపోగా నిందితుడిని కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నారాయణపూర్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద ఐదు ప్యాకెట్లలోని 83గ్రాముల బంగారం, రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి సహకరించిన వారితోపాటు ఆడిట్, విజిలెన్స్ టీమ్, క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై దర్యాప్తు కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. కేసును ఛేధించిన వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య, టౌన్ సీఐ భీమ్‌కుమార్, ధారూరు సీఐ రఘురాములు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# గంజాయి స్మగ్లర్లతో పోలీసుల దోస్తీ

**ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్ • మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ**

పటాన్‌చెరు, నవంబర్ 1 : గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు నెరుపుతున్న ఇద్దరు ఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌ను మల్టీజోన్-2 ఐజీ వీ సత్యనారాయణ సస్పెండ్ చేశారు. పటాన్‌చెరు ఎస్సై అంబారియా, వీఆర్ ఎస్సై వినయ్‌కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ మారుతీనాయక్, ఏఆర్ కానిస్టేబుల్ మధును శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గత మే నెలలో సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం సనత్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై అంబారియా, కానిస్టేబుల్ మధు ఓ వాహనాన్ని అడ్డుకుని 120 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో వాహనంతోపాటు నిందితుడిని వదిలేశారు. మరో కేసులో గంజాయిని రవాణా చేస్తున్న ముఠాను నిజామాబాద్ జిల్లా వర్ని దగ్గర పట్టుకున్నారు. అక్కడి నుంచి వారిని నారాయణఖేడ్‌కు తీసుకుని వచ్చి 400 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనంతో సహా నిందితుడిని వదిలేశారు. ఈ రెండు ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపారు. విచారణ నివేదిక ఆధారంగా సదరు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు.